"ఇది కాగితాలు చెల్లాచెదురు కాకుండా కలిపి వుంచుతుంది. అలాగే మనుషులంతా సమైక్యంగా జీవించాలని దీని అర్థం."

చివరగా ఓ టీ బేగ్‌ని తీసి చూపించాడు.

"ఇది అన్నిటికన్నా ముఖ్యమైంది. తనకంటూ ఏం దాచుకోకుండా ఈ టీ బేగ్ ఉన్నదంతా తను మునిగే వేడి నీటికి ఇస్తుంది. అలాగే మనల్ని కష్టాల్లోకి నెట్టేవారిని కూడా క్షమించి, మనకంటూ ఏం మిగుల్చుకోకుండా ఉన్నదంతా వారికి పంచాలి. అప్పుడే సాధన ఫలించి ముక్తి పొందుతాం"

గురువు వివరణతో శిష్యులు ఎంతో నేర్చుకున్నారు.

## 8. సమాధానం

ఓ వ్యక్తి బాగా నాస్తికుడు. అతను ఓసారి ఒక సద్గురువు దగ్గరకు ఓ మిత్రుడితో వెళ్ళాడు. ఆయన దేవుడ్ని భజించడం వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి చెప్పాడు.

"ఎవరికైనా, ఏమైనా అనుమానాలున్నాయా?" ప్రశ్నించాడాయన.

"మీరు చెప్పిందంతా బావుంది. కానీ అసలు దేవుడు ఎవరో, ఎక్కడుంటాడో, ఎలా వుంటాడో వివరంగా చెప్పగలిగితే అప్పుడు మీరు చెప్పింది నేను నమ్ముతాను." చెప్పాడా నాస్తికుడు.

"దేవుడ్ని గురించి నువ్వు అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్తాను. అందుకు ముందుగా నువ్వు ఓ పని చేయాలి."

ఏం చేయాలో వివరించాడు సద్గురువు.

నాస్తికుడు అందుకు ఒప్పుకుని ఇంటికి వెళ్ళాడు. తన ఇంటి డాబా మీద ఇరవై కిలోల మట్టిని పోశాడు. అందులో ఆనపకాయ గింజని పాతి నీళ్ళు పోసి పెంచసాగాడు.

కొన్నాళ్ళకు ఆనపగింజ మొలకెత్తి, పెరిగి డాబా అంతటా పాకింది.

దానికి నలభై రెండు ఆనపకాయలు కాసాయి. నాస్తికుడు వాటిని కోసి సద్గురువు దగ్గరకి తీసుకెళ్ళాడు. సద్గురువు ఆ కాయలన్నిటిని తూకం వేయించాడు. అవి మొత్తం వంద కిలోల బరువున్నాయి.

నాస్తికుడు తన ప్రశ్నలని సద్గురువుకి మళ్ళీ గుర్తు చేసాడు. సద్గురువు అతని వంక వాత్సల్యంగా చూసి చిరునవ్వుతో చెప్పాడు.

"నీ సందేహాలకి సమాధానాలు చెప్తాను. కాకపోతే ఇందులో నాకు అర్థం కాని ఓ సంగతి చెప్పు."

"ఏమిటది?" ప్రశ్నించాడు నాస్తికుడు.

"గ్రాము బరువు కూడా లేని విత్తనాన్ని ఇరవై కిలోల మట్టిలో పాతావు కదా! మరి అందులోంచి వంద కిలోల ఆనపకాయలు ఎలా వచ్చాయి?"

నాస్తికుడికి సమాధానం తట్టలేదు.

"నా ప్రశ్నకి సమాధానం ఏదో, నీ ప్రశ్నలకీ అదే సమాధానం." నవ్వుతూ చెప్పాడు సద్గురువు.

## 9. కనువిప్పు

ఒకతని దగ్గర ఓ అందమైన గుర్రం వుంది. పూర్తిగా తెల్లగా, నిగనిగలాడుతూ వుండే అది చురుగ్గా పరిగెత్తగలిగేది. దాన్ని చూసి ముచ్చటపడి ఇంకొకతను దాన్ని తనకి అమ్మమని కోరాడు. అందుకతను సమ్మతించలేదు. ఆ గుర్రం మీది కోరికని చంపుకోలేక బేరసారాలకి దిగాడు.

"పైకంతో పాటు నా దగ్గరున్న ఆవుని కూడా ఇస్తాను." చెప్పాడు.

అయినా గుర్రం యజమాని దాన్ని అమ్మడానికి ఒప్పుకోలేదు.

"పోనీ ఐదు ఆవులిస్తాను."

ససేమిరా అన్నాడు గుర్రం యజమాని.

"సరే. నాదగ్గరున్న పది ఆవులూ నీకిచ్చేస్తాను. దయచేసి నీ గుర్రం ఇవ్వు." ఆఖరి ప్రయత్నం చేసాడతను.